క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

అగళి: మండల కేంద్రంలోని శంకరేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం 1 గంటకు 'బాబు షూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందుపురం పార్లమెంట్ ఇన్చార్జ్ రమేష్కుమార్రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ యాక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రొళ్లలో...

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' పై మండల విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు హాజరవుతారన్నారు.

గుడిబండలో చిరుత సంచారం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామ సరిహద్దులో గురువారం రాత్రి చిరుత సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. దీంతో గ్రామస్తులు బయటకు రావాలంటేనే హడలి పోతున్నారు. ఈ సందర్భంగా చిరుత ఓ కుక్కను చంపేసింది. సంబంధిత అటవీశాఖ అధికారులు చిరుత బారి నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

లేపాక్షి: మండలంలో పని చేసి ఇతర మండలాలకు బదిలీ అయిన 23 మంది ఉపాధ్యాయులను శుక్రవారం విద్యాశాఖ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహించారని, విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 కుళ్లాయప్పతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐ మాజీ ప్రిన్సిపాల్పై చర్యలు తీసుకోవాలి

పెనుకొండ: పట్టణ సమీపంలోని తిమ్మాపురం వద్ద ఉన్న శ్రీ వెంకటసాయి ఐటీఐ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ కే. రాజుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఐటీఐలో ప్రిన్సిపాల్గా పనిచేసే సమయంలో విద్యార్థుల ఫీజును కొంత యాజమాన్యానికి చెల్లించి, మిగిలిన డబ్బును వ్యక్తిగతానికి వాడుకున్నాడన్నారు. వెంటనే మాజీ ప్రిన్సిపాల్పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

లింక్ డ్యూటీలకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు

పెనుకొండ: లింక్ డ్యూటీలపై అభ్యంతరం తెలుపుతూ ఆర్టీసీ డీఎం మొండి వైఖరిని నిరసిస్తూ పలువురు కండక్టర్లు, డ్రైవర్లు శుక్రవారం ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు ఫిక్స్ ఛార్జ్ వేసే సందర్భంలో అధికారులు లింక్ డ్యూటీలతో చార్జ్ వేస్తున్నారని, ఏకపక్షంగా డ్యూటీలు వేయడం సరికాదన్నారు. పనిభారంతో డ్యూటీలు చేయడం కష్టంగా మారిందన్నారు. నాయకులు రమణా, లతీఫుల్లా, నాగరాజు, శ్రీనివాసరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే భవిష్యత్తు అంధకారం



మాట్లాడుతున్న ఏడీ అర్చన

హిందూపురం: మత్తుకు బానిసలైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని, వాటికి దూరంగా ఉండాలని నిషాముక్తి అభియాన్ ఏడీ అర్చన, లీగల్ సెల్ ఎస్ఐ శ్రీహరి తెలిపారు. నిషా ముక్తి భారత్ అభియాన్, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేకశాఖ సహాయ సంచాలకులు, భారత్ ముక్తి అభియాన్ స్పేర్ డ్రగ్ డీ ఆడిక్షన్ సెంటర్ సంయుక్తంగా హిందూపురంలోని ప్రభుత్వ ఐటీఐ, బాలాజీ , బాలయేసు డిగ్రీ కళాశాలల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఎనీ టైం మూత



అమరాపురంలో మూతపడిన ఏటీఎం

అమరాపురం: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ముందు భాగాన ఏర్పాటు చేసిన ఏటీఎం ఎప్పుడూ మూతపడి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అతి పెద్దదైన కెనరా బ్యాంకులో రైతులు, మహిళలు, పెన్షనర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు ఖాతాలు కలిగి ఉన్నారు. నిత్యం ఈ బ్యాంకు కూడా రద్దీగా ఉంటుంది. అయితే ఏటీఎం పనిచేయక ఆరునెలల గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏటీఎంను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో సబ్సెంటర్



కంప చెట్ల మధ్య శిథిలావస్థలో ఉన్న పీహెచ్సీ సబ్సెంటర్

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి పీహెచ్సీ సబ్సెంటర్ ఏళ్ల తరబడి వృథాగా మారడంతో శిథిలావస్థకు చేరుకుంది. గతంలో వైద్య సిబ్బంది ఇక్కడే ఉండి వైద్య సేవలు అందించే వారు. కానీ నేడు సబ్సెంటర్ నిరవధికంగా మూతబడి శిథిలావస్థకు చేరుకోవడంతో తిమ్మాపురం, ఇస్లాపురం, కొండంపల్లి తదితర గ్రామాల ప్రజలు వైద్యం కోసం పెనుకొండకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి దుస్థితిలో ఉన్న పీహెచ్సీని మార్చి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డెక్కుతున్న మెట్లు



గుడిబండలోని రాజుకాలనీలో రోడ్డుపైన నిర్మించిన మెట్లు

గుడిబండ: గజం జాగా అదనంగా వచ్చే అవకాశం ఉందనుకుంటే అది రోడ్డు అయినా సరే ఆక్రమించి నిర్మాణాలు కానిచ్చేస్తున్నారు. గుడిబండ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కొందరు ఏకంగా రోడ్లపైకి వచ్చి మరీ నిర్మాణాలు చేస్తున్నా పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. రోడ్డును ఆక్రమించి ర్యాంపులు ఏర్పాటు చేసుకున్న వారిపై పంచాయతీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తే ఆయా గృహ నిర్మాణదారులు తమపై గొడవ చేస్తారన్న భయంతో స్థానికులు కూడా నోరుమెదపడం లేదు. ఫలితంగా రోడ్లు ఇరుకుగా మారుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సుపరిపాలన ప్రచారమంతా బూటకం



మోసం గ్యారెంటీ క్యూఆర్కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్సీపీ సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణులు



సమావేశానికి హాజరైన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: సుపరిపాలనలో తొలి అడుగు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారం అంతా బూటకం. హిందూపురంలో పరిపాలన అన్నదే లేదు. అని వైఎస్సార్సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని మరవకొత్తపల్లి సమీపంలోని విరాట్ ప్యాలెస్లో 'బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. దీపిక మాట్లాడుతూ ఇక్కడి వారు నమ్మి ఓట్లేస్తే ఎక్కడో పక్క రాష్ట్రమైన హైదరాబాదులో ఉండే ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజలను నట్టేట ముంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభివృద్ధి అంటూ ప్రజల్లోకి వెళ్లి అభాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. విద్య, వైద్యం విషయంలో రాజీ పడకుండా మాజీ సీఎం వైఎస్ జగన్ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ప్రస్తుతం కూటమి నేతలు తమ జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. రూ.92 కోట్లతో హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధికి అంటూ ఉత్తుత్తి ప్రచారాలు చేసుకుంటున్నారని, పురంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకొని జేబులు నింపుకుంటున్నారు తప్ప.. పురం ప్రజల గురించి కనీసం ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజాను అసభ్య పదజాలంతో దూషించిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది చేతగాని ప్రభుత్వం

వైఎస్సార్సీపీ నేత వేణురెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కంపెనీల తెస్తామని ప్రజల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టేకులోడు పంచాయతీలో రైతుల వద్ద సేకరించే భూములను తక్కువకు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ల హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి విమర్శించారు. కూటమి నాయకులు చేతగాని హామీలిచ్చి ప్రజలను వంచించారని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ ధ్వజమెత్తారు. జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయలేకనే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలు చేస్తున్న అక్రమాలను వెలికితీస్తున్న 'సాక్షి' మీడియాపై బెదిరింపులకు దిగుతుండటం హేయమన్నారు. కేవలం ఈవీఎంల సహాయంతోనే కూటమి గెలిచిందనడానికి హిందూపురం నియోజకవర్గం ఉదాహరణ అని దేశం మొత్తానికి తెలుసని రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్కుమార్రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, గిరిధర్ రాజు, మహిళా నేత కవితారెడ్డి, మాజీ మండల కన్వీనర్లు ప్రభాకర్రెడ్డి, మద్దిపి లక్ష్మీనారాయణ, సర్పంచ్లు సంధ్య, జయశంకర్రెడ్డి, ఎంపీటీసీలు కవిత, టీ. కవిత, మంజునాథరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, కౌన్సిలర్ షాజియా, నాయకులు అమరనాథరెడ్డి, అన్సర్ అహ్మద్, లక్ష్మిరెడ్డి, సుధాకర్రెడ్డి, చిన్నప్పయ్య, అంజన్రెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయమే ఫైనల్

చిలమత్తూరు: పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయాలు తమ పరిధిలోవి కావని వైఎస్సార్సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీలోని పలువురు నేతలపై విధించిన సస్పెన్షన్కు.. తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. వైఎస్సార్సీపీ పెద్ద పార్టీ అని , వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ కమిటీనే చర్యలు తీసుకుంటుందన్నారు. అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి అండగా ఉంటామన్నారు. హిందూపురంలో వైఎస్సార్సీపీని బలపరచడమే ప్రథమ కర్తవ్యమన్నారు. తమతో నడిచేవారిని కలుపుకొని వెళతామని, వ్యతిరేకించే వారిని ఏం చేయాలో అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి విద్యుత్ సబ్స్టేషన్ 33 కేవీ లైన్లో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో ఏఈ సంజీవప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పెద్దిరెడ్డిపల్లి సబ్స్టేషన్ పరిధిలోని కొడిగెనహళ్లి, శ్రీరంగరాజుపల్లి, మోదా, శాసనకోట పంచాయతీ గ్రామాల్లో కరెంటు ఉండదన్నారు.

21న మడకశిరకు హోంమంత్రి రాక

మడకశిర: రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ఈనెల 21న మడకశిరకు వస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థుల పోస్టు కార్డు ఉద్యమం

రొద్దం: ఆర్టీటీ సంస్థకు ఎఫ్సీఆర్ఏ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీటీకి ఎఫ్సీఆర్ఏ మంజూరు చేయాలని పోస్ట్ కార్డుల ద్వారా కోరారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

హిందూపురం: గొల్లపల్లి వాటర్ పంప్ హౌస్ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్కుమార్, వాటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రమేష్లు డిమాండ్ చేశారు. శుక్రవారం హిందూపురం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే గొల్లపల్లి వాటర్ పంప్ హౌస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 1వ తేదీ లోపుగా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గతేడాది(2024–25) పని చేసిన కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి 2025–26 విద్యాసంవత్సరానికి రెన్యూవల్కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ఐడీ కళాశాలైన కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డా. స్మిత శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ ఈ నెల 19 లోపు వారు పని చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్సీ ధ్రువీకరణ పత్రం, అదనపు అర్హతలు, 2024–24 విద్యాసంవత్సరం రిజల్ట్ అనాలసిస్ జత చేయాలని సూచించారు.

చెత్త సేకరణపై అవగాహన

హిందూపురం: పట్టణాల తరహాలో పంచాయతీల్లోనూ తడిపొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి శివనారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్ అన్నారు. హిందూపురం మండలంలోని తూమకుంట పంచాయతీలో శుక్రవారం తడి చెత్త పొడిచెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

రొద్దం: ప్రతీ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ కుర్లపల్లి గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహాల మండలి ఆధ్వర్యంలో అధ్యక్షురాలు సుశీలమ్మ సమక్షంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



యువకులను విచారిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

పెనుకొండ: పట్టణంలో నూతన వ్యక్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో భాగంగా పట్టణంతో పాటు శివార్లలో నివాసం ఉంటున్న వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఏ ప్రాంతానికి చెందిన వారు, ఎక్కడ పని చేస్తున్నారు, కంపెనీ పేర్లు తదితర వాటిపై ఆరా తీశారు. వారి ఆధార్ కార్డులతో పాటు ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామంలో అదే గ్రామానికి చెందిన టి.తిమ్మాజమ్మ అనే మహిళ అక్రమంగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకొచ్చి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. ఆమె వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 40 (90ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గుడిబండలో..

గుడిబండ: మండలంలోని మందలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఇందిరమ్మ అనే మహిళ అక్రమంగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకొచ్చి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజ్కుళ్లాయప్ప తెలిపారు. ఆమె వద్ద 13 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భూసదస్సును విజయవంతం చేయండి

పెనుకొండ: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 20న నంద్యాలలో జరిగే భూసదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, బాబావలి, సివిల్ సప్లయ్స్ హమాలీ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

శాకంబరిగా కెంచమాంబదేవి



అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంటలో వెలసిన కెంచమాంబదేవి శుక్రవారం రాత్రి శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఛత్రంలో మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు



అమరాపురంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు

మడకశిరరూరల్/అమరాపురం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్సీపీ శ్రేణులకు పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం మడకశిర మండలం బుళ్లసముద్రం, ఛత్రం పంచాయతీల కేంద్రాలతో పాటు అమరాపురంలోని వీరశైవ కల్యాణ మంటపంలో బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా మండలాల కన్వీనర్లు రామిరెడ్డి, త్రిలోక్నాథ్ అధ్యక్షత కార్యక్రమాలు జరిగాయి. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు ఏనాడూ పూర్తిగా అమలు చేసిన చరిత్ర లేదన్నారు. కూటమి పాలనపై ఏడాదికే అన్ని వర్గాల నుంచి ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. కూటమి నాయకుల అక్రమ కేసులు, దౌర్జన్యాలకు ఎవరూ భయపడవద్దని కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పార్టీ బలోపేతానికి కృషి

వైఎస్సార్సీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ సెక్రటరీ వజ్రా భాస్కర్రెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్తో పాటు ఎన్నో హామీలను గుప్పించి సీఎం అయ్యాక ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రతి గ్రామంలోనూ వివిధ పార్టీ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసుకుని ఈ నెల 22 నుంచి 30వ తేదీలోపు కమిటీల ద్వారా ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వివరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలన్నారు. మడకశిర నియోజకవర్గ గ్రామ, వార్డు కమిటీలు రాష్ట్ర స్థాయిలోనే రోల్ మోడల్గా నిలిచే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మధుమతిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, కార్యదర్శి సాయిలీల, జాయింట్ సెక్రటరీ భారతీరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, మడకశిర మున్సిపాలిటీ విభాగం సెక్రటరీ అంజలి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి లింగారెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, మండల రూరల్, టౌన్ కన్వీనర్లు రామిరెడ్డి, సతీష్కుమార్, ఎంపీపీలు కవిత, ఈరన్న, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, కృష్ణమూర్తి, రంజిత్కుమార్, జెడ్పీటీసీలు సభ్యులు అనంతరాజు, భూతరాజు, బీసీ విభాగం అధ్యక్షులు హలుకూరు కాంతరాజు, సత్యనారాయణ యాదవ్, నియోజవర్గ ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శివన్న, శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నటరాజు, ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తన్న, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు వీరక్యాతరాయ, గగన, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మడకశిర తాలుకా, మండల కమిటీల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు మల్లికార్జున, శేషాద్రి, సుధాకర్, మాశేగౌడ్, నరసింహ, జయరాజ్, రంగనాథ్, సికింధర్, మంజునాథ్, హనుమంతు, తిమ్మప్ప, మధు, లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి, మంజునాథ్, నర్సారెడ్డి, రఘునందన్, ధను, బాలకృష్ణారెడ్డి, నాగభూషణరెడ్డి, సురేష్రెడ్డి, రాజు, రామాంజప్ప, రంగస్వామి, రవిచంద్ర, గంగాధర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భానుప్రకాశ్ను అరెస్ట్ చేయండి

మడకశిర: మాజీ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరిపై ఎమ్మెల్యే భానుప్రకాశ్పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు గౌరవ లేదన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా టీడీపీ నాయకులు మహిళల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై రాష్ట్రంలో దాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. మహిళలకు అన్యాయం జరుగుతుంటే హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భానుప్రకాశ్పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

జలధికి తరలిన పీర్లు

పెనుకొండ: చిన్నపీర్ల పండుగలో భాగంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని స్థానిక దర్గా సర్కిల్ నుంచి పీర్ల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బాబయ్య చెరువు వద్ద అల్విదా పాడుతూ జలధి కార్యక్రమాన్ని చేశారు.



జలధికి తరలుతున్న పీర్లు

23న ఎస్ఎస్కే సంఘం కార్యవర్గం ఎన్నికలు

పావగడ: స్థానిక ఎస్ఎస్కే (శని మహాత్మ కార్య నిర్వాహక సంఘం) కార్యవర్గ పదాధికారుల ఎన్నికలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సోమసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఫలితాలు కూడా అదేరోజు వస్తాయన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్ను ఎంఈఓ శ్రీనివాస్ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఆయన విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని, ఆహారం నాణ్యతగా ఉండటం లేదని విద్యార్థులు తెలిపారు. రూ.15 లక్షలు మంజూరయ్యాయని, సమస్యలను వారంలోపు పరిష్కరిస్తామని ఎంఈఓ తెలిపారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ

గుడిబండ: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద నాలుగు కిలోల చొప్పున రాగులు, కందులు, మినుములు ఇతరాత్ర ప్రత్యామ్నాయ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.